# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



# 69 వ భాగం

### అజామీళోపాఖ్యానం – 4

### విష్ణు, యమదూతల సంవాదం

అజామీళుడు ప్రాణం పోతున్నప్పుడు కనబడిన యమదూతలని చూసి భయంతో, కొడుకుమీద మమకారంతో 'నారాయణ, నారాయణ' అంటూ పోయాడు కదా? ఇన్నాళ్ళూ భగవంతుడు గుర్తుకు రాకుండా ఎన్ని పాపాలు చేసాడో? ఏమౌతుందిప్పుడు, నరకానికేనా వెళ్ళేది ఇంక?

అసలు కథ స్వర్గం నరకం గురించి కాదు. జీవితం ఉన్నప్పుడే మంచి పనులు చేయడం – ఎందుకు, దేనికోసం, ఏం సాధించాలి అనే ప్రశ్నలు అడగకుండా – అసలు మనిషన్నవాడు అవతలివారికి మంచి చేయడం కోసమే సృష్టించబడ్డాడు అనేది తెలుసుకుని ఆనందంగా (పాపం చేయకుండా) జీవించాలి అన్నది పరమార్ధం. మహాభారతం చదివిన వారు ఓ సారి అవలోకనం చేసి చూడండి – ధర్మరాజు ఎన్ని కష్టాలు పడ్డాడో? ఒక్కసారైనా 'కృష్ణా, నాకిలా కష్టం వచ్చింది, నువ్వు భగవంతుడివి, ఆ రోజు కౌరవ సభలో ద్రౌపది అడగ్గానే వచ్చి సాయం చేసావు కూడా, ఇప్పుడు కూడా వచ్చి నన్ను ఆదుకో' అని అడగడం ఎక్కడైనా ఉందా? జూదం ఆడుతున్నప్పుడు కానీ, అరణ్య అజ్ఞాత వాసాలలో కానీ, ఎప్పుడైనా ధర్మరాజు కృష్ణుణ్ణి అడిగాడా? ఆయన మొత్తం భారతం లో అంతా ఒకటే అడుగుతాడు, "నేను చేసేది ధర్మమా కాదా, నువ్వు మా వైపు ఉండు చాలు." ఓ దశలో భీముడు, ద్రౌపది కూడా అరణ్యవాసం చేస్తున్నప్పుడు ధర్మరాజుని వెక్కిరిస్తారు – ఏ పనీ చేయకుండా, అలా జూదం ఆడి అన్నీ పోగొట్టుకున్నావు, నువ్వు రాజాధిరాజువి, నువ్వు సరే అంటే నేనూ అర్జునుడూ వెళ్ళి ఇప్పుడే వాళ్లందర్నీ చంపేస్తాం, ధాం, ధూం అనడం, నువ్వు అలా ఎప్పుడో ఏదో రోజు ధర్మం గెలుస్తుందని చూస్తూ కూర్చుంటే, యముడొచ్చి నీ ప్రాణాలు తీస్తాడు, ఇంతా చేసి నువ్వో చేతకానివాడివి అనిపించుకుంటావు అని. ఇంకా పైకి ఎగదోసి,"కృష్ణుణ్ణి అడగొచ్చుకదా, గురుపుత్రుణ్ణి సాక్షాత్తూ యముడి దగ్గిర్నుంచి వెనక్కి తీసుకొచ్చినవాడు నీకు రాజ్యం ఇప్పించలేడా" అంటారు.

అప్పుడు చెప్తాడు ధర్మరాజు, "కష్టాలనేవి రావడానిక్కారణం మనం ఏదో జన్మలో చేసిన కర్మ. నేను అడిగితే కృష్ణుడు రాజ్యం కాదు, భూమండలం అంతా నా చేతిలో పెట్టగలడు నిజమే. కానీ ఆ కొండలనీ ఆ చెట్లనీ చూడండి. ఎంత అందంగా, మనోహరంగా ఉన్నాయో, అవి భగవంతుడి సృష్టి. వాటిని చూసి ఆనందించడమే కానీ 'భగవంతుడా, నీకి అదిచ్చాను కనక నాకు ఇది ఇయ్యి,' అంటూ నేను బేరం చేయలేను. నేను నా కర్మ ఎంతటిదైనా అనుభవించడానికి సిద్ధమే కానీ భగవంతుడితో బేరం మాత్రం చేయమని నన్ను అడక్కండి." ఇదే మనం సరిగ్గా గ్రహించవల్సిన విషయం. మన జీవితంలో జరిగే మంచి చెడులు మన ఎప్పుడో చేసిన కర్మ మాత్రమే. వాటికి భగవంతుడో సాక్షి. దానికి ఆయన్ని విమర్శించడం సరైనదేనా? ఏ మత గ్రంథం చూసినా దాదాపు ఇదే బోధన కనిపిస్తుంది. నాకు ఇది ఇయ్యి, అది ఇయ్యి, ఎందుకు ఇవ్వవు అని అడగకుండా, "భగవంతుడా, నువ్వు నా కూడా ఉండు, అంతే చాలు; మిగతావి వాటికవే వస్తే వస్తాయి. రాకపోతే పోనియ్, నువ్వున్నావు అదే చాలు." మరో విషయం ఎంతటి హాస్యమైనదో చూడండి, మనకి అన్నీ ఉన్నాయి. కూడూ, బట్టా, ఇల్లూ, ఉద్యోగం, భర్తా/భార్యా, పిల్లలూ ఉన్నా సరే ఏదో లేదని అసంతృప్తి, పక్కవాడికి ఉంది నాకు లేదని ఏడుపు. భగవంతుడికి ఒకరిమీద మోజు, నేనంటే నచ్చదు అని మన భావన. ఇన్ని ఇచ్చిన భగవంతుడు మనకి ఇంకా ఏమివ్వాలి? అదలా ఉంచితే మనం భగవంతుడికి ఏమిస్తున్నాం? ఓ సారి గుడికి వెళ్ళినప్పుడు – మనకి అన్నీ ఇచ్చిన భగవంతుడికి – వంద రూపాయలు ఇవ్వడానికి వెనుకడుగు! పోనీ ఇస్తే అక్కడ మనకి వెనక్కి ఏమి వచ్చింది అనే ప్రశ్న. ఇది విచిత్రం కదా? మళ్ళీ కథలోకి వస్తే,

క. దూరమున నాడు బాలుఁడు
బోరనఁ దన చిత్తసీమఁ బొడగట్టిన నో!
నారాయణ! నారాయణ!
నారాయణ! యనుచు నాత్మనందను నొడివెన్. [6-72]

ఎన్నోపాపాలు చేసి ఏనాడూ భగవంతుణ్ణి తలుచుకోని అజామీళుడు, ప్రాణం పోతున్నప్పుడు తన కర్మకి తగిన శిక్ష విధించే యమకింకరులని చూస్తూ భయపడుతున్నప్పుడు, చిన్న కొడుకు కనిపించగానే వాణ్ణి 'నారాయణా, నారాయణా' అని పిలుస్తూ తలుచుకున్నాడు కదా. అదే సమయంలో ప్రాణం పోయింది.

చ. మరణపువేళ నద్దనుజమర్దను సంస్మరణంబు జేయఁ ద
త్పరిసరవర్తు లాత్మపరిపాలకు నామము నాలకించి ని
ష్ఠురగతి నేగుదెంచి పొడచూపి యదల్చిరి కాలుదాసులన్
ఖరతరభాషులన్ వికట కల్పిత వేషుల దీర్ఘరోషులన్. [6-73]

అలా ప్రాణంపోయేటపుడు దనుజ (రాక్షస) మర్దనుడైన (అణిచేవాడు) నారాయణుణ్ణి తలుచుకోవడం అయింది అనుకోకుండా. దాంతో ఆ పరిసరాల్లో తిరుగుతున్న విష్ణుదూతలు ఆ నామాన్ని అజామీళుడు అనడం గమనించి అక్కడకొచ్చి యమదూతలని అదిల్చారు. ఇక్కడ నారాయణుడంటే? విష్ణుదూతల ఆత్మపరిపాలకుడు. అంటే ఈ దూతలు ఎక్కడున్నాసరే ఓ సారి వాళ్ళ యజమాని పేరు వినిపించగానే అక్కడకి చేరుకుంటారన్నమాట. అందుకే కాబోలు మనవాళ్లెప్పుడూ, "మంచి ఆలోచనలతోమాట్లాడాలి, పైన తథాస్తు దేవతలు ఉంటారు" అని చెప్తారు కాబోలు.

క. దాసీభర్త నజామిళ
భూసురుఁ దత్తనువువలన బోరన వెలికిం
దీసిన యమభటులఁ దొలఁగఁ
ద్రోసిరి శ్రీవరుని కూర్మిదూతలు కడిమిన్. [6-74]

వ. ఇట్లు విష్ణుదూతల వలన నిర్ధూత ప్రయత్నులై యమదూత లిట్లనిరి. [6-75]

ఇలా వచ్చిన విష్ణుదూతలు అజామీళుడి ప్రాణాలని అతని శరీరంలోంచి బయటకి లాగే యమభటులని కిందకి తోసారు. ఈ విషయంలో వాళ్లతో గెలవలేక (నిర్ధూత ప్రయత్నులై) యమదూతలు ఇలా అడుగుతున్నారు.

క. ఎవ్వనివారలు? మాతోఁ
జివ్వకుఁ గత మేమి? యిట్లు చిక్కినవానిం
గ్రొవ్వున విడిపించితి; రిఁక
నవ్వులకో? జముని శాసనంబులు జగతిన్. [6-76]

మీరెవరు? మాతో దెబ్బలాటకి ఏమిటి కారణం, ఇంతకు ముందు మిమ్మల్ని ఎక్కడ చూసాం, ఇతని ప్రాణం తీసుకెళ్తున్న మమ్మల్ని అడ్డుకుని వాణ్ణి ఎందుకు విడిపించారు. యమ శాసనాలు జగత్తులో సరదాగా నవ్వులాటకి సృష్టించబడ్డాయనుకుంటున్నారా?

సీ. ఎవ్వరు మీ రయ్య? యీ భవ్యరూపముల్;
గన్నుల కద్భుతక్రమ మొనర్చె;
దివిజులో? భువిజులో? దేవతాప్రవరులో? ;
సిద్ధులో? సాధ్యులో? చెప్పరయ్య;
దళిత పాండుర పద్మదళ దీర్ఘ నేత్రులు, ;
వర పీత కౌశేయ వాసు లరయ
గండమండల నట త్కుండల ద్వయులును, ;
బటు కిరీటప్రభా భాసితులును, [6-78]

తే. భూరి పుష్కర మాలికా చారువక్షు,
లమిత కోమల నవయౌవ నాధికులును,
బాహు కేయూర మణిగణ భ్రాజమాన
ఘన చతుర్భుజు, లభ్రసంకాశ రుచులు. [6-78.1]

మీ రూపాలు చూడబోతే పద్మాలవంటి నేత్రాలతో, కిరీటాలతో, హార కేయూరాలు, చతుర్భుజరూపులై ఉన్నారు; మీ యవ్వనం, పసుపు బట్టల్తో వెలుగులు చిందే మిమ్మల్ని ఎప్పుడూ చూడలేదు, మీరు దేవతలా, ఆకాశంలో ఉండేవారా, భూమి మీద ఉండేవారా, సిద్ధులో, సాధ్యులో, మీ రూపాలు మా కళ్లకి ఆశ్చర్యం గొలుపుతున్నాయి.

ఈ భటుల విషయం చూస్తే విష్ణుదూతలు కూడా, సాక్షాత్తూ విష్ణువులాగానే చతుర్భుజాలతో ఉండడం గమనించవచ్చు. మన హిందూ మందిరాలలో కూడా విష్ణు ద్వారం వద్ద తలో పక్క శంఖ చక్రాయుధులైన జయ విజయులని చూడవచ్చు. పోతన కవిత్వం ప్రకారం వీళ్లందరూ కూడా – కిరీట మకరకుండల కేయూర హార కటక కంకణ, మణి మేఖలాంబర విరాజితులు. విష్ణువుకీ వీళ్లకీ తేడా ఒకటే – ఆయన మామగారు సముద్రుడు ఇచ్చిన కౌస్తుభం వక్షస్థలంలో ఉంచుకున్న మణిమేఖలాంబర వనమాలికా విరాజితుడు.

క. ధనువులు, నిషంగచయములుఁ,
గన దంబుజ, శంఖ, చక్ర, ఖడ్గ, గదా, సా
ధనములు ధరియించిన మీ
తనువులు లోకముల కద్భుతం బొనరించెన్. [6-79]

మీరు ధనస్సులూ, అమ్ములపొదలూ (నిషంగచయములు), శంఖ చక్రాయుధాలు ధరించడం చూస్తే మీ శరీరాలతో లోకాద్భుతంగా కనిపిస్తున్నారు.

క. శాంతంబు లయిన మీ తను
కాంతులు జగములను దిశలఁ గలిగిన బహుళ
ధ్వాంతములఁ బాఱఁదోలుచు
సంతస మొనరించె నిపుడు సర్వంకషమై. [6-80]

శాంతమూర్తులైన మీ శరీరాలు జగంలో చీకట్లని, పాపాలని పోగొడుతూ (సర్వంకషమై – సమస్తాన్నీ సానబెడుతూ), దిశదిశలా కాంతులు ప్రసారం చేస్తున్నాయి. ఈ పద్యంలో చీకటి అనే పదం ఎక్కడుందో గమనించారా? ధ్వాంతము = అంధకారము/చీకటి.

ఒకటి గమనించారా? యమకింకరులని వర్ణించేటపుడు వాళ్లకి నలుపు వర్ణం, కోపగ్రస్తులై, రోమాలు నిక్కబొడుచుకున్నట్టు ఉండడం, అదే విష్ణుభటులైతే పసుపు బట్టలూ, శాంతమూర్తులూ, కిరీట హార కేయూరాలూ అనేవి వర్ణించడం. ఒకటి ఋణాబంధమైన పాప కర్మ అయితే దానికి విరుద్ధమైనది ధనానుబంధమైన పుణ్యకర్మ. ఇటువంటి విషయాలు మనం పాటించే హిందూ ధర్మంలో కూడా గమనించవచ్చు – పెళ్ళి లేక ఏదైనా శుభకార్యం చేసే చోట పసుపు కలిపిన అక్షింతలూ, ప్రేత కర్మ చేసే చోట నల్లటి నువ్వులూ నీళ్ళతో వదలడం. ఈ రెండూ కూడా బంధనాలే భగవంతుణ్ణి చేరడానికి ఎందుకంటే భగవంతుడు త్రిగుణాతీతుడు. ఏ కర్మకీ అంటనివాడు. అయితే శుభకార్యాలతో (అంటే చేసే మంచిపనులతో) ఈ బంధనాలు వదుల్చుకుని ఆయన్ని చేరవచ్చు. వివరంగా చెప్పాలంటే, చేసే శుభాశుభ కర్మలు రెండింట్లో ఒకటి భగవంతుడికి దూరంగా తీసుకెళ్తే రెండోది ఆయన దగ్గిరగా తీసుకెళ్తుంది. కానీ ఆయన్ని చేరేకొద్దీ ఈ రెండింటినీ వదుల్చుకోవాలి.

వ. ఇట్లఖిల లోకానందకర కమ్రాకారులు, నఖిల విభ్రాజమాన తేజో దుర్నిరీక్ష్యమాణులును, నిఖిలధర్మపాలురును నగు మీరు ధర్మ పరి పాలుర మమ్ము నడ్డపెట్టం గతం బేమి?" యనిన మందస్మిత కందళిత ముఖారవిందులయి గోవిం దుని కందువ మందిరంబు కావలివారలు వారివాహ గంభీర నిర్ఘోష పరిపోషణంబు లైన విశేషభాషణంబుల నిట్లనిరి.

[6-81]

ఇలా లోకానందకారులు, అఖిలమైన తేజంతో ఉన్నవారైన మీరు, యమధర్మరాజు ధర్మాన్ని పాలించే మమ్మల్ని అడ్డం పెట్టడానికి ఏమిటి కారణం? యమకింకరులు ఇలా అడిగేసరికి విష్ణుదూతలు (గోవిందుని కందువ మందిరంబు కావలివారు) సమాధానం చెప్తున్నారు. ఎలాగ చెప్తున్నారు? వారివాహ గంభీర నిర్ఘోష పరిపోషణంబులైన విశేష భాషణంబుల – మేఘ గర్జనవంటి గంభీరమైన విశేషమైన స్వరంతో.

ఉ. మీరు పరేతనాయకుని మేలిమి దూత లంటేనిఁ బల్కుఁ డా
తోరపుఁ బుణ్యలక్షణము, దుష్కృత, దండకృత్యమున్
బీరముతోడ నీతని కభీష్టనివాసముఁ, బోలి దండ్యు లె
వ్వారలొ? సర్వభూతములొ? వారొక కొందఱు పాపకర్ములో? [6-82]

మీరు కనక యముడి (పరేత = మరణించినవారు; భూతములు, నాయకుడు) దూతలైనట్లైతే ముందు ఈ ప్రశ్నకి సమాధానం చెప్పండి – పుణ్యలక్షణం, పాపకృత్యం అనేవి ఎటువంటివి? వాటిని బట్టి ఈ అజామీళుడు ఉండవల్సిన స్థానం ఏమిటి? యముడు దండానికి బలయ్యేది (దండ్యులెవ్వారలో – దండింపదగినవారు) పాపాత్ములు కొందరు మాత్రమేనా, ప్రపంచంలో పుట్టే ప్రతీ ప్రాణీనా?

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS